
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 16 । జూన్ । 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో గురువారం నాటికి 34.731 టీఎంసీలు ఉన్నాయి. ఫైతట్టు ప్రాంతాల నుంచి 11 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.60,720
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,453
3 శాతం జీఎస్టీతో	రూ.5,617
సవర (8 గ్రా)	రూ.44,100

గరిష్టం/కనిష్టం
42.0 /32.0

వాతావరణం

బుధవారంతో పోలిస్తే గురువారం జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు కొంతమేర పెరిగాయి. గాలిలో 35 శాతం తేమ ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు.

న్యూస్‌రీల్

పారదర్శకంగా బదిలీల ప్రక్రియ

- డీపీఓ సుస్మితారెడ్డి



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీపీఓ

నెల్లూరు(పొగతోట): సచివాలయాల పరిధిలో పంచాయతీ కార్యదర్శుల బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు డీపీఓ సుస్మితా రెడ్డి తెలిపారు. నెల్లూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ గురువారం జరిగింది. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇది పూర్తి అయిన తర్వాత జాబితాను సిద్ధం చేసి ఉత్తర్వులు ఇస్తామని తెలిపారు.

బీమా పథకంపై అవగాహన



మాట్లాడుతున్న మహేశ్వరుడు

నెల్లూరు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ పశు బీమా పథకంపై పాడి రైతులకు అవగాహన కల్పించాలని పశుసంవర్ధక శాఖ అధికారి మహేశ్వరుడు తెలిపారు. నెల్లూరులోని రైల్వే ఫీడర్స్ రోడ్డులో ఉన్న కార్యాలయంలో డివిజన్ స్థాయి సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు బీమా రిజిస్ట్రేషన్స్ చేయించుకోవాలన్నారు. అనుకోని పరిణామాలతో పశువులకు ఏదైనా జరిగితే పరిహారం అందుతుందన్నారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

17న ఐటీఐ కౌన్సెలింగ్

నెల్లూరు(టౌన్): 2023 – 24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 17వ తేదీన నెల్లూరు వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 139 మెరిట్ వరకు ఉదయం, 140 నుంచి 279 మెరిట్ వరకు మధ్యాహ్నం సమయంలో కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. విద్యార్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లతో రావాలని తెలియజేశారు.

టీఎస్ పీజీ లాసెట్‌లో నెల్లూరీయుడి ప్రతిభ



రవీంద్రబాబు

నెల్లూరు(బృందావనం): కవి, రచయిత, విశ్రాంత ఇంజినీర్ అయిన నెల్లూరీయుడు తూపిలి రవీంద్రబాబు తెలంగాణ పీజీ లాసెట్‌లో ప్రథమ ర్యాంకు సాధించారు. 55 ఏళ్ల వయసులో ఆయన యువతతో పోటీపడి విజయం సాధించారు. ఈ ఏడాది జూన్ 25న ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో టీఎస్ పీజీఎల్ సీఈటీ–2023 ఎల్ఎల్ఎం ప్రవేశపరీక్ష నిర్వహించారు. ఇందులో ఆయన 100కి 93 మార్కులు సాధించి ప్రథముడిగా నిలిచారు. జిల్లాలోని విడవలూరుకు చెందిన రవీంద్రబాబు 1987లో నెల్లూరు పాలిటెక్నిక్‌లో సివిల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా చదివారు. ఆ తర్వాత కేంద్ర పట్టణాభివృద్ధి శాఖలో 1990లో జూనియర్ ఇంజినీర్‌గా ఉద్యోగం పొందారు. లా చదివేందుకు 55 సంవత్సరాల వయసులో స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేశారు. తొలుత ఏపీ లాసెట్–2020లో ప్రథమ ర్యాంకు సాధించి విజయవాడ సిద్ధార్థ లా కళాశాలలో ఎల్ఎల్‌బీ కోర్సును అభ్యసిస్తున్నారు. తాజాగా తెలంగాణ పీజీ లాసెట్ రాసి ప్రథముడిగా నిలిచారు. పీజీ పూర్తి అయిన తర్వాత నెల్లూరులో న్యాయవాదిగా స్థిరపడే ఆలోచన ఉందని రవీంద్రబాబు తెలిపారు.

ఐసెట్ ఫలితాల విడుదల

నెల్లూరు(టౌన్): ఏపీ ఐసెట్ ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశం కోసం గతనెల 24, 25 తేదీల్లో పరీక్షలు జరిగాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యాప్తంగా 414 మంది దరఖాస్తు చేసుకోగా 390 మంది హాజరయ్యారు. వీరిలో 372 మంది ఉత్తీర్ణత సాధించారు. ఐసెట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా ఆయా యూనివర్సిటీలు, కళాశాలల్లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో సీట్లు కేటాయిస్తారు.

లోకేశ్ పాదయాత్రకు దూరంగా..

జనం నుంచి కనిపించని స్పందన
- స్వాగతించని పల్లెలు
- పార్టీ జెండాలు మోసే వారూ కరువే..
- ముఖం చాటేసిన జిల్లా నాయకులు
- ఈవెనింగ్ వాక్‌లా పాదయాత్ర
- టీడీపీలో అంతర్మథనం

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రను జనం పట్టించుకోవడం లేదు. సాయంత్రం వేళ ప్రారంభించి కొంచెం దూరం నడిచి ఆపేస్తుండడంతో అసలు పాదయాత్ర జరుగుతుందా అనే అనుమానం చాలామందిలో నెలకొంది. నెల్లూరు జిల్లాలో పార్టీకి మైలేజ్ వస్తుందని అధిష్టానం భావించగా.. అసలు యాత్రను ఎవరూ గుర్తించని పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో అటువైపు వెళ్లకపోవడమే మంచిదనుకుని టీడీపీ ముఖ్య నాయకులు కూడా ముఖం చాటేస్తున్నారు.



ఆత్మకూరు నియోజకవర్గంలో గురువారం రాత్రి ముఖ్య నాయకులు లేకుండానే కొనసాగుతున్న లోకేశ్ పాదయాత్ర

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: లోకేశ్ పాదయాత్ర రాయలసీమలో పూర్తి చేసుకుని ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చేరుకుంది. సాయంత్రం వేళ ఈవెనింగ్ వాక్‌లా జరుగుతున్న యాత్రకు జనాదరణ కరువై అట్టర్ ఫ్లాప్ అయ్యింది. జనసమీకరణ కోసం టీడీపీ నేతలు ఆపసోపాలు పడుతున్నారు. మరో వైపు పల్లెల్లో లోకేశ్‌కు స్వాగతం పలికేందుకు ప్రజలు ముందుకు రాకపోవడంతో వాకింగ్ వేగం పెంచేసి టెంట్‌లోకి వెళ్లిపోతున్నారు. రెండు రోజులుగా పాదయాత్రలో వందల అడుగులు కూడా ఆయన వెంట పడకపోవడంతో అవమానంగా భావిస్తున్నారు. యాత్రలో అద్దె జనాలను ప్రవేశపెట్టేందుకు మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రయత్నాలు చేస్తున్నా సఫలం కావడం లేదు.

స్పందన కరువు

జిల్లాలో టీడీపీ పనైపోయింది. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రాఫ్ పెంచుకునేందుకు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా జనం నుంచి స్పందన కరువైంది. నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు ఆశావహులు ముందుకు రాని దుస్థితికి వచ్చేసింది. ఈ క్రమంలో పదవులు కట్టబెట్టిన పార్టీకి వెన్నుపోటు పొడిచిన ముగ్గురు వలస నేతల వైపు దృష్టి మళ్లింది. వారి ద్వారానైనా పాదయాత్రను విజయవంతం చేసుకుందామని ఆశించిన పార్టీకి నిరాశే మిగులుతోంది. నాలుగేళ్లుగా ఆత్మకూరు నియోజకవర్గానికి ఇన్‌చార్జిని పెట్టలేకపోయిన టీడీపీ అధిష్టానం.. లోకేశ్ పాదయాత్ర బాధ్యతలను వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డికి కట్టబెట్టింది. ఆయన పచ్చ కండువా కప్పుకోకుండానే చినబాబు ఈవెనింగ్ వాక్‌ను విజయవంతం చేసే బాధ్యతలను భుజాలపై వేసుకున్నారు. స్వాగత ఏర్పాట్లంటూ రెండురోజులపాటు మర్రిపాడులో తిష్ట వేయగా.. చేతి చమురు వదిలినా జనసమీకరణ చేయలేక చతికిలపడ్డారు. జిల్లా నలుమూలల నుంచి తరలించినా మూడు వేలకు మించకపోవడంతో స్వాగతం కాస్త అట్టర్ ఫ్లాప్ అయ్యింది.

స్థానికులెక్కడ?

ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో లోకేశ్ సాయంత్రం వేళ నడుస్తుండగా తన బృందం కనిపిస్తోంది తప్ప స్థానికులెవరూ ముందుకు రావడం లేదు. దీంతో చినబాబుకు ఘోర అవమానంగా మారింది. రైతు సదస్సులు, స్థానికులు, యువతతో ముఖాముఖీ లాంటి కార్యక్రమాల్లో వందలోపు అద్దె జనాలు ఉంటున్నారు. రైతులుగా చోటా నేతలను చూపిస్తున్నారు. మూడు రోజులుగా చేస్తున్న ఏ కార్యక్రమంలోనూ స్థానికుల నుంచి స్పందన కరువవడంతో నిర్వాహకులు తలపట్టుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయి.

తప్పించుకుంటున్నారు

లోకేశ్ పాదయాత్రకు జిల్లా నేతలతోపాటు నియోజకవర్గ స్థాయి నేతలు కూడా ముఖం చాటేస్తున్నారు. పార్టీని నమ్ముకున్న నేతలను కరివేపాకుల్లా తీసిపారేస్తుండడంతో వారు యాత్రను పట్టించుకోకుండా తప్పించుకుంటున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న నేతలను కాదని వలస నేతలు, పారిశ్రామికవేత్తలు, ఎన్ఆర్ఐలంటూ కొత్తవారిని తెరపైకి తెస్తుండడంతో నియోజకవర్గాల్లో పచ్చపార్టీ వర్గ రాజకీయాలతో నలిగిపోతోంది. అధిష్టానంపై ఆగ్రహంతో ఉన్న తమ్ముళ్లు పాదయాత్రను విజయవంతం చేసేందుకు ముందుకు రావడం లేదనే అభిప్రాయం ఉంది. కొందరు విదేశీ పర్యటనలు, అనారోగ్య కారణాలు చూపి ముఖం చాటేశారు.

జన సమీకరణ కోసం..

అనంతసాగరంలో జరగనున్న లోకేశ్ సభను విజయవంతం చేసేందుకు జనసమీకరణకు ఆనం ఆపసోపాలు పడుతున్నారు. పార్టీని నమ్ముకున్న వారికి ద్రోహం చేసిన చినబాబు వెంట నడిచేందుకు కేడర్ ముందుకురావడం లేదు. ఆనం రాకతో పార్టీలో అంతర్గత విభేదాలు తారస్థాయికి చేరాయి. కన్నబాబు, కొమ్మి లక్ష్మయ్య నాయుడు, బొల్లినేని కృష్ణయ్య వర్గీయులు మండిపడుతున్నారు. ఆనం వస్తే ఆయన వర్గీయులు ఇకపై పెత్తనం చెలాయించే అవకాశం ఉంది. ఫలితంగా జెండా మోసిన నాయకులు, కార్యకర్తలకు ద్రోహం జరిగినట్లేననే భావన ఉంది. లోకేశ్ సభను విజయవంతం చేస్తే ఆనంకు మార్కులు పడే అవకాశం ఉందని కన్నబాబు, కొమ్మి వర్గీయులు దూరంగా ఉంటున్నారు. స్థానిక నేతల సహకారం లేదు. దీంతో అద్దె జనాలతోనే సభను నడిపించేందుకు రామనారాయణరెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతి పల్లెకు వాహనాలు పెట్టడంతోపాటు వచ్చే జనాలకు డబ్బు, మద్యం బాటిళ్లు పంచే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిసింది.

వేగవంతంగా గృహ నిర్మాణాలు

- కలెక్టర్ హరినారాయణన్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హరినారాయణన్ తదితరులు

నెల్లూరు(దర్గామిట్ట): నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో చేపట్టిన గృహ నిర్మాణాలను వేగవంతంగా సకాలంలో పూర్తి చేసేలా అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి పలు శాఖల ప్రత్యేక కార్యదర్శులతో కలిసి అమరావతి నుంచి జగనన్న సురక్ష, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన, భూముల రీ సర్వే, రెవెన్యూ అంశాలకు సంబంధించిన స్పందన గ్రీవెన్స్, ఇళ్ల నిర్మాణాలు, ప్రాధాన్యత భవనాల నిర్మాణాల్లో పురోగతి, ఉపాధి హామీ పథకం కింద పనిదినాల కల్పన తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా హరినారాయణన్ జిల్లాలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాల్లో పురోగతిని వివరించారు. పనులపై రోజూ సమీక్షిస్తూ వేగంగా జరిగేలా చర్యలు తీసుకున్నట్లు సీఎస్‌కు వివరించారు. రెండు వారాల్లో సుమారు రూ.10 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. జగనన్న కాలనీల్లో తాగునీటి వసతి, విద్యుత్ కనెక్షన్లు, అంతర్గత రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ తదితర మౌలిక సదుపాయాల ఏర్పాటుకు సంబంధిత శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నట్లు వివరించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జేసీ ఆర్.కూర్మనాథ్, నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఆర్‌డీఏ, డ్వామా, హౌసింగ్, ఐసీడీఎస్ పీడీలు సాంబశివారెడ్డి, వెంకట్రావు, నాగరాజు, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలకు సన్మానం



నెల్లూరులో విద్యార్థికి అవార్డు అందజేస్తున్న ఆదాల, అరుణమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి

పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో నియోజకవర్గ స్థాయిల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాల పేరుతో ప్రతిభా అవార్డులను గురువారం జిల్లా వ్యాప్తంగా అందజేశారు. నెల్లూరు కేఎన్నార్ పాఠశాలలో విద్యార్థులను ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సన్మానించారు.

– సాక్షి నెట్‌వర్క్

ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఎంతో బాగుంది



మా స్కూల్లో మొదటి నుంచి ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఎంతో బాగుంది. ఇష్టపడి చదివేలా ప్రోత్సహించారు. దీంతో పదో తరగతిలో 593 మార్కులొచ్చాయి. భవిష్యత్తులో మరింత ఉత్తమ ఫలితాలు సాధించేందుకు యత్నిస్తా.

– గోకుల్‌కృష్ణారెడ్డి, విద్యార్థి, కేఎన్నార్ స్కూల్

పదో తరగతిలో 587 మార్కులు వచ్చాయి



పదో తరగతి ఫలితాల్లో 587 మార్కులు సాధించడం ఎంతో సంతోషంగా ఉంది. పాఠశాలలో చక్కటి విద్యా బోధనతో పాటు క్రమశిక్షణ ఉంటుంది. దీంతో ఉత్తమ ఫలితాలను సాధించగలిగాను.

– మానస, విద్యార్థి, కేఎన్నార్ స్కూల్

ఇంటర్‌లోనూ ఉత్తమ ఫలితాలు సాధిస్తా



పదో తరగతి ఫలితాల్లో 583 మార్కులు వచ్చాయి. ప్రభుత్వ పాఠశాలలో ఈ ఫలితాన్ని సాధించడం ఎంతో గర్వంగా ఉంది. ఇంటర్మీడియట్‌లోనూ ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ముందుకెళ్తా.

– దేవర్షిణి, విద్యార్థి, దర్గామిట్ట బాలికల జెడ్పీ హైస్కూల్

ఏపీ విద్యా సంస్కరణలు దేశానికే ఆదర్శం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



విద్యార్థులకు అవార్డులు అందజేసిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


పొదలకూరు: 'మన రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన విద్యా సంస్కరణలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. నాడు – నేడు పథకాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలించి దేశమంతా ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తోంది.' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సర్వేపల్లి నియోజకవర్గ స్థాయిలో టెన్త్, ఇంటర్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాల పేరుతో ప్రతిభా అవార్డులను గురువారం పొదలకూరు పట్టణం డీఎన్నార్ జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ విద్య కోసం వెచ్చించే ధనాన్ని ఖర్చు కింద పరిగణించకూడదన్నారు. విద్యకు కేటాయించే నిధులను మానవవనరుల కింద చూడాలన్నారు. గతంలో పాఠశాలల్లో మరుగుదొడ్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురైన సందర్భాలున్నాయని మనబడి నాడు – నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌ను తలదన్నేలా మారాయన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో బడులు తెరిచిన ఆరునెలల వరకు పుస్తకాలు అందేవి కాదని, ఇప్పుడు పునఃప్రారంభం రోజునే విద్యా కానుక ద్వారా అందజేస్తున్నట్లు తెలిపారు. తాను జెడ్పీ చైర్మన్‌గా ఉన్న కాలంలో జెడ్పీ పాఠశాలల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన టెన్త్ విద్యార్థులకు రూ.లక్ష, రూ.75 వేలు, రూ.50 వేలు నగదు పురస్కారాలను అందజేసినట్లు గుర్తుచేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆణిముత్యాల పేరుతో విద్యార్థులకు నగదు పురస్కారాలను అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థులకు సన్మానం

నియోజకవర్గ స్థాయిలో పది పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన పొదలకూరు డీఎన్నార్ జెడ్పీ బాలికల పాఠశాల విద్యార్థులు అచ్చి వైష్ణవి (592 మార్కులు), ఆర్.తేజస్విని (584), కె.సాయిభార్గవి (582), ఇంటర్‌లోని వివిధ గ్రూపుల్లో ప్రతిభ చూపిన పొదలకూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థిని చలంచర్ల శ్రీనిత (850 మార్కులు, సీఈసీ), టీపీ గూడూరు జూనియర్ కాలేజీ విద్యార్థిని కనుపూరు కావ్య (971, బైపీసీ), టీపీ గూడూరు ఏపీ రెసిడెన్షియల్ కాలేజీ విద్యార్థిని తానేటి ప్రణిత (964, ఎంపీసీ)ను కాకాణి సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ లక్ష్మీప్రసన్న, ఎంఈఓ మధుసూదన్, ఎంపీడీఓ నరసింహారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ గణేష్‌సాయి, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, ఎంపీటీసీలు జి.లక్ష్మీకల్యాణి, జి.శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య, పార్టీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తి తగ్గడంతోనే..

- చికెన్ ధరలు పైపైకి..
- ఆశించిన స్థాయిలో లేని కోళ్ల ఉత్పత్తి
- నెలరోజుల వ్యవధిలోనే ధరల్లో మార్పు
- కోడిగుడ్డు ధరలూ అదే దారిలో..



నెల్లూరు(సెంట్రల్): కోళ్ల ఉత్పత్తి తగ్గిపోయింది. దిగుమతి ఆశించిన స్థాయిలో లేక మాంసం ధర క్రమంగా పెరుగుతోంది. ప్రతి సంవత్సరం ఎండాకాలంలో ధరల్లో పెరుగుదల ఉంటున్నా.. ఈ ఏడాది ఇంకొంచెం అధికంగా ఉందనేది విక్రయదారులు చెబుతున్న మాట.

చిత్తూరు, తమిళనాడు సౌత్, బెంగళూరు సౌత్‌ల నుంచి జిల్లాకు కోళ్లను దిగుమతి చేసుకుంటారు. సాధారణంగా ఒక కోడి 45 రోజుల్లో 2.50 కిలోల నుంచి 3 కిలోల వరకు తూకం వస్తుంది. వేసవి కాలం కావడంతో తూకం 1.50 కిలోల నుంచి 1.70 కిలోలకు పడిపోతోంది. అవి ఆహారం పెద్దగా తీసుకోకపోవడంతో ఆ ప్రభావం ఎదుగుదలపై పడినట్లు చెబుతున్నారు. గత నెల 10వ తేదీన కిలో స్కిన్‌లెస్ ధర రూ.266 ఉండగా, ప్రస్తుతం రూ.324కి చేరింది. సాధారణ చికెన్ ధర అప్పట్లో కిలో రూ.240 ఉండగా, ప్రస్తుతం రూ.294 పెరిగింది. ధరలు ఇంకా పెరిగే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

70 వేల కిలోల విక్రయాలు

జిల్లాలో కోడి మాంసం విక్రయాలు బాగా జరుగుతుంటాయి. ఆదివారం ఒక్కరోజే సుమారు లక్ష కిలోలు, మిగిలిన రోజుల్లో 70 వేల కిలోల మేర విక్రయిస్తుంటారు. కోళ్ల దిగుమతి కూడా ఏరోజుకారోజు ఉంటుంది. 60 టన్నుల నుంచి 80 టన్నుల వరకు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు.

పెరిగిన కోడిగుడ్డు ధరలు

కోడిగుడ్డు ధర కూడా పెరుగుతోంది. మొన్నటి వరకు రూ.4.50 ఉన్న ఒక గుడ్డు ధర ప్రస్తుతం రూ.6 కి చేరింది. కొన్నిచోట్ల రూ.6.50 కూడా అమ్ముతున్నారు. కాగా కోడిగుడ్లను ఎక్కువగా హైదరాబాద్, చిత్తూరు ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. అందులో హైదరాబాద్ వాటానే ఎక్కువ. అధిక ఉష్ణోగ్రతల కారణంగా గుడ్ల ఉత్పత్తి బాగా తగ్గిపోయి ధర పెరిగినట్లు చెబుతున్నారు. జిల్లాలో నిత్యం 4.50 లక్షల కోడిగుడ్లను విక్రయిస్తుంటారు.

ధర ఎక్కువగా ఉంది



కొన్నిరోజులుగా చికెన్ ధర ఎక్కువగా ఉంటోంది. రోజూ ధర పెరుగుతూనే ఉంది. ఉత్పత్తి తగ్గడంతోనే ధరలు పెరిగినట్లు చికెన్ షాపుల నిర్వాహకులు చెబుతున్నారు. కోడిగుడ్డు ధర కూడా అధికంగా ఉంది.

– చెన్నయ్య, ఖాన్‌సాహెబ్‌పేట

కొన్నిరోజులు ఇంతే..

అధిక ఉష్ణోగ్రతల కారణంగా కోళ్ల ఉత్పత్తి బాగా తగ్గింది. తూకం బాగా తగ్గిపోతున్నాయి. ఇది ప్రతి సంవత్సరం మామూలే. కాకపోతే ఈ సారి కాస్త అధికంగా ఉంది. కొన్ని రోజులు ఇలానే ఉంటుంది. కోడిగుడ్లది అదే పరిస్థితి.

– జీవీ రమణయ్య, నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ

రెండు ఈ-స్టాంపింగ్ కేంద్రాలు ప్రారంభం



ఈ-స్టాంప్‌ను అందజేస్తున్న డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ కిరణ్‌కుమార్

నెల్లూరు సిటీ: నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈ స్టాంపింగ్ కేంద్రాన్ని రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ వి.కిరణ్‌కుమార్ గురువారం ప్రారంభించారు. అనంతరం మద్రాసు బస్టాండ్ ప్రాంతంలోని జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో మరో ఈ-స్టాంపింగ్ కేంద్రాన్ని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 52 ఈ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. ఈ విధానం ఆన్‌లైన్ పద్ధతిలో జరగడం ద్వారా అక్రమాలకు అవకాశం లేదన్నారు. నాన్ జ్యుడిషియల్ స్టాంప్‌ల తయారీ వ్యయం ఎక్కువగా ఉండడం, మరో ప్రాంతం నుంచి స్టాంప్ పేపర్లు తీసుకురావడానికి వ్యయప్రయాసలు పడాల్సి ఉందన్నారు. ఈ-స్టాంపింగ్ విధానం ద్వారా పని మరింత సులువవుతుందన్నారు. డిజిటల్ పద్ధతిలో నమోదై ఉండడం ద్వారా పారదర్శకంగా ఉంటుందన్నారు. వాటర్‌మార్క్, హోలోగ్రామ్, బార్‌కోడ్, మైక్రో ఫీచర్స్‌తో సెక్యూరిటీ కలిగి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, జిల్లా ఆడిట్ రిజిస్ట్రార్ సీవీ హరివర్మ, స్టోన్‌హౌస్‌పేట సబ్‌రిజిస్ట్రార్ ఐ.విజయరాణి పాల్గొన్నారు.

ఇందుకూరుపేట ఎస్సైపై సస్పెన్షన్ వేటు

ఇందుకూరుపేట: ఇందుకూరుపేట ఎస్సై వెంకటరాజేష్‌పై ఎస్పీ డాక్టర్ తిరుమలేశ్వరరెడ్డి సస్పెన్షన్ వేటు వేశారు. ముదివర్తిపాళేనికి చెందిన ఓ గిరిజన మహిళపై అదే ప్రాంతానికి చెందిన పాస్టర్ ఐజయ్య లైంగికదాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై ఎస్సై కేసు నమోదు చేయకపోవడంతోపాటు, రాజీ కుదిర్చారని ఉన్నతాధికారుల విచారణలో తేలడంతో సస్పెండ్ చేసినట్లు పోలీస్ అధికారులు గురువారం తెలిపారు.

పవన్‌వి మతిలేని విమర్శలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట : హైదరాబాద్‌లో ఉండే పవన్ కల్యాణ్ అప్పుడప్పుడు వచ్చి మతిలేని విమర్శలు చేయడం తప్ప ఒరిగేదేమీ లేదని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. ఇందుకూరుపేటలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడకు వెళ్లినా ప్రజలు సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదిస్తున్నారని, బీజేపీ, టీడీపీ, జనసేన కలిసినా జగన్‌ను ఏమీ చేయలేరని తెలిపారు. ఎన్నికల్లో రెండు చోట్ల ఓడిపోయిన పవన్‌కు రాజకీయాలు తెలియదన్నారు. ఓ పక్క చంద్రబాబు, లోకేశ్‌తో పాటు పవన్ అర్థరహిత విమర్శలు చేయడం ద్వారా ఏమీ సాధించలేరని, ప్రజల వారిని నమ్మే పరిస్థితి లేదన్నారు. ఈ జిల్లాకు నెల్లూరు బ్యారేజీ, సంగం బ్యారేజీ, కృష్ణపట్నం పోర్టు, సెజ్‌లను ఏర్పాటు చేసింది దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి అని, తొమ్మిదేళ్లు ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు కాగితాలకే పరిమితమయ్యారని తెలిపారు. ఇన్ని చేస్తే జిల్లాకు వచ్చిన లోకేశ్ ఆయన తండ్రి ఏమి చేశాడో చెప్పాలన్నారు. అనంతరం సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే ప్రసన్న, వైఎస్సార్‌సీపీపై పాటల ఆల్బమ్‌ను డీసీఎంఎస్ డైరెక్టర్ గునుపాటి సురేష్‌రెడ్డి రూపొందించగా, దీనిని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్ పశుబీమా పోషణ పథకం పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీఎల్డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, డీసీఎమ్మెస్ డైరెక్టర్ గునుపాటి సురేష్‌రెడ్డి, నాయకులు గురుజాల బుజ్జిబాబు, వేళ్ల భానుచంద్రశేఖర్ పాల్గొన్నారు.

సంక్షేమ పాలన జగనన్నతోనే సాధ్యం

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

దగదర్తి (కావలి) : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదల సంక్షేమం సాధ్యమని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. దగదర్తి మండలం బోడిగుడిపాడులో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆయన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, వివిధ రంగాల్లో సాధించిన ప్రగతిని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు తెలిపారు. ప్రతి పథకం గ్రామ స్థాయిలోనే పేదలకు అందాలనే లక్ష్యంతో గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను ప్రారంభించినట్లు వివరించారు. సచివాలయాల ద్వారా పథకాలు నేరుగా పేదల ఇంటి ముంగిటకే అందుతున్నాయని తెలిపారు. ఈ తరహా సంక్షేమ పాలన దేశంలో ఎక్కడా లేదన్నారు. ప్రతి పేద కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో అమ్మఒడి, ఆసరా, చేయూత, భరోసా తదితర పథకాలను అమలు చేసినట్లు తెలిపారు. వీటితో పాటు నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చడం, ఫ్యామిలీ డాక్టర్ పేరుతో ప్రతి కుటుంబానికి వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావడం వంటి పథకాలు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చాయని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లూరి ప్రసాద్‌నాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

హామీలన్నీ సకాలంలో అమలు



స్థానికుల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

చేజర్ల(సోమశిల) : మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను సకాలంలో అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. అనంతసాగరం మండలంలోని ఆమని చిరువెళ్ల, మేకవారిపల్లె, వెంగంపల్లెలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆయన గురువారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ఆయా కుటుంబాలకు అందజేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఆమని చిరువెళ్ల గ్రామ ఎస్సీ కాలనీలో రోడ్డు మంజూరు చేయాలని కోరగా, ప్రతిపాదనలు సిద్ధం చేసి మంజూరు చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా గృహ నిర్మాణాలు, శ్మశాన స్థలం, తాగునీటి సమస్యల గురించి వివరించగా, ప్రతి సమస్యను నిర్ణీత గడువులోపు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక ఎస్టీ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం లేదని తెలుపగా, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అంగన్‌వాడీ కేంద్రం మంజూరుకు కృషి చేస్తానన్నారు. మేకవారిపల్లె గ్రామస్తులు తమకు రోడ్డు మంజూరు చేయాలని విన్నవించడంతో నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలంతా సుభిక్షంగా ఉన్నారని తెలిపారు. ఉనికి కోసమే ప్రతిపక్షాలు అర్థరహిత విమర్శలు చేస్తున్నాయన్నారు. ఎంపీపీ సంపూర్ణమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బిజివేముల ఓబుల్‌రెడ్డి, సర్పంచ్‌లు లక్ష్మమ్మ, లక్ష్మీదేవి, శోభ, ఎంపీసీసీ సభ్యురాలు సుబ్బమ్మ, వైఎస్సార్‌సీపీ నేతలు సుబ్బారావు, శ్రీరామ్, శేషయ్య, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

పుదుచ్చేరి చీఫ్ సెక్రటరీతో భేటీ



రాజీవ్ వర్మకు స్వాగతం పలుకుతున్న ఆర్డీఓ

నెల్లూరు(దర్గామిట్ట) : తమిళనాడు నుంచి విజయవాడ వెళ్తున్న పుదుచ్చేరి చీఫ్ సెక్రటరీ రాజీవ్ వర్మను నెల్లూరులో కలెక్టర్ ఎం.హరినారాయణన్, ఆర్డీఓ మలోల గురువారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. విజయవాడ వెళ్తూ నెల్లూరులో కాసేపు బస చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు కలిసి పలు విషయాలు చర్చించుకున్నారు.

మోదీ వల్లే దేశంలో అభివృద్ధి



మాట్లాడుతున్న దుష్యంత్ కుమార్ గౌతమ్

నెల్లూరు(మినీబైపాస్) : ప్రధాని నరేంద్ర మోదీ వల్లే దేశంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నట్లు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ దుష్యంత్ కుమార్ గౌతమ్ అన్నారు. స్థానిక మినీబైపాస్‌లోని బీజేపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత తొమ్మిదేళ్ల బీజేపీ పాలనలో భారతదేశం ఎంతో ప్రగతిని సాధించిందన్నారు. బాలికల సంఖ్య తగ్గకుండా సుకన్య సమృద్ధి యోజన ద్వారా అనేక మంది మహిళలను రక్షించామని, ఇప్పుడు ప్రతి వెయ్యి మంది మగవారికి 1020 బాలికలు ఉన్నారు. అనేక రహదారులు, రైళ్ల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమైందన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను కూడా అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్రరెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, బీజేపీ అధికార ప్రతినిధి ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	:174
లేయర్ (లైవ్)	:105
బ్రాయిలర్ చికెన్	:294
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:324
లేయర్ చికెన్	:178



వెంగమాంబకు పొంగళ్ల సమర్పణ



పొంగళ్లు పెడుతున్న మహిళలు

- ముగిసిన బ్రహ్మోత్సవాలు

దుత్తలూరు : గత ఐదు రోజులుగా జరుగుతున్న వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. ఉదయం మహిళలు అమ్మవారికి పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభలు కట్టిన బండ్లు, అందంగా అలంకరించిన ట్రాక్టర్లు, లారీలతో భక్తజన సందోహం పెద్ద సంఖ్యలో ఉత్సవంలో పాల్గొన్నారు. బుధవారం అర్ధరాత్రి ప్రారంభమైన ప్రధాన ఉత్సవం బీసీ కాలనీ, ఉలవవారిపాళెం మీదుగా నర్రవాడ చేరుకుంది. బ్రహ్మోత్సవాలు చివరిరోజు కావడంతో భక్తుల రద్దీ పెరిగి క్యూలైన్ కిక్కిరిసింది. భక్తులు హోమగుండంలో వేలకిలోల ఎండు కొబ్బరి వేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు వివిధ వినోద కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకొని కాయకర్పూరం సమర్పించారు. అలాగే ఎడ్లు బండలాగు పందేలు చూసేందుకు భక్తులు పోటీ పడ్డారు. సాయంత్రం అమ్మవారికి సాంప్రదాయబద్ధంగా చీర, సారె తీసుకొచ్చారు.



ప్రధాన ఉత్సవంలో వెంగమాంబ, గురవయ్య దంపతులు

ఎడ్ల పందేల విజేత బాపట్ల

బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగిన ఎడ్ల బండలాగుడు పోటీలో బాపట్ల జిల్లా వేటపాళేనికి చెందిన శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరికి చెందిన ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచి రూ.55 వేల నగదు బహుమతి పొందాయి. ద్వితీయ స్థానంలో కృష్ణా జిల్లా ఘంటసాల, తృతీయ స్థానంలో నంద్యాల జిల్లా జిల్లెల్లకు చెందిన ఎడ్లు నిలిచాయి. విజేతలకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, దేవదాయ శాఖ అధికారులు నగదు బహుమతులు అందజేశారు.

ఉదయగిరిలో మేకపాటి గౌతమ్‌రెడ్డి స్మృతివనం

- మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి



స్మృతివనం గురించి చర్చిస్తున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి

ఉదయగిరి : ఉదయగిరిలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో గౌతమ్‌రెడ్డి స్మారక స్మృతివనం ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం వ్యవసాయ కళాశాలలో స్మృతివనం ఏర్పాటుకు సంబంధించి స్థలాన్ని పరిశీలించారు. అనంతరం వ్యవసాయ కళాశాల అధ్యాపకులు, ఇంజినీర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రూ.250 కోట్ల విలువైన కళాశాల ఆస్తులను వ్యవసాయ కళాశాల కోసం ప్రభుత్వానికి ఇచ్చామని, భవిష్యత్తులో ఇది గొప్ప యూనివర్సిటీగా రూపాంతరం చెందుతుందన్నారు. వందెకరాల విశాలమైన స్థలంతో పాటు యూనివర్సిటీ ఏర్పాటుకు కావల్సిన అన్ని మౌలిక వసతులు, భవనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న వ్యవసాయ కళాశాలలో గౌతమ్‌రెడ్డి స్మృతివనం ఆకర్షణీయంగా రూపొందిస్తామని చెప్పారు. ఈ స్మృతివనం ప్రారంభోత్సవానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తారని చెప్పారు. రాబోయే రెండు మూడేళ్లలోనే సోమశిల హైలెవల్ కెనాల్ 1, 3 దశలు కూడా పూర్తవుతాయని చెప్పారు. అటు వెలుగొండ, ఇటు హైలెవల్ కెనాల్ పనులు పూర్తయితే ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లోని మెట్ట భూములు సస్యశ్యామలంగా మారుతాయన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నేత మేకపాటి రాజగోపాలరెడ్డి, ఇంజినీర్ ఢిల్లీబాబు, జిల్లా జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ కరుణసాగర్, నేతలు కండ్లగుంట వెంకటేశ్వరరెడ్డి, షేక్.గాజుల షర్ఫుద్దీన్, గోగుల వెంగలరెడ్డి, గాజుల ఫరుఖ్‌అలి ఉన్నారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి : రూ.35

సన్నవి : రూ.20

పండ్లు : రూ.7



నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు శిక్షణ

- ఫుడ్‌సేఫ్టీ కంట్రోలర్ వెంకటేశ్వర్లు



నెల్లూరు(సెంట్రల్) : ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు ఇస్తున్నట్లు జిల్లా ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్ జి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నెల్లూరులోని నిప్పో సెంటర్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈనెల 21 నుంచి కలెక్టర్ హరి నారాయణన్ ఆదేశాల మేరకు నెస్లే సంస్థతో కలిసి రోడ్డు పక్కన ఆహార విక్రయాలు చేస్తున్న వ్యాపారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిక్షణలో మెప్మా అధికారుల భాగస్వామ్యం ఉంటుందన్నారు. నాణ్యమైన ఆహారం ఏ విధంగా తయారు చేయాలి, ఎంత మోతాదులో ఇంగ్రీడియంట్స్‌ను వాడాలి, నూనె విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. ఐదు రోజుల పాటు రోజుకు 100 మంది చొప్పున 500 మంది వ్యాపారులకు శిక్షణ ఇస్తామన్నారు. నెస్లే సంస్థ ప్రత్యేకించి ఉచితంగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తోందని, తర్వాత గుర్తింపు సర్టిఫికెట్‌లు ఇస్తుందన్నారు. ప్రస్తుతం ఆహార విక్రయాలపై విస్తృతంగా తనిఖీలు చేస్తున్నామని, ఇటీవల కాలంలోనే దాదాపుగా 45 కేసుల వరకు నమోదు చేసి జేసీ ఆధ్వర్యంలో విచారణ చేసి నిబంధనలు అతిక్రమించిన వారికి రూ.4.50 లక్షల వరకు జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ శిక్షణలో పాల్గొని ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని విక్రయించే విధంగా వ్యాపారులు చొరవ తీసుకోవాలని సూచించారు.

ఇద్దరు విద్యార్థులు డిబార్

వెంకటాచలం : వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో గురువారం నిర్వహించిన డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారని వీఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షల్లో 8,036 మంది విద్యార్థులకు గాను, 7,523 మంది హాజరు కాగా 534 మంది గైర్హాజరయ్యారు. నెల్లూరులోని జగన్స్ డిగ్రీ కళాశాలలో ఓ విద్యార్థి డిబార్ అయ్యారు. మధ్యాహ్నం జరిగిన రెండో సెమిస్టర్ పరీక్షకు 8,699 మంది విద్యార్థులకు 8048 మంది హాజరు కాగా 675 మంది గైర్హాజరయ్యారు. నాయుడుపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓ విద్యార్థి డిబార్ అయినట్లు తెలిపారు.

మూడో రోజు సాగిన పాదయాత్ర



ఆత్మకూరు : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర మూడో రోజు గురువారం అనంతసాగరం మండలం బొమ్మవరం, చిలకలమర్రి, కామిరెడ్డిపాడు గ్రామాల మీదుగా సాగింది. మొత్తం 14 కిలోమీటర్లు పాదయాత్ర జరిగింది. ఈ సందర్భంగా చిలకలమర్రి గ్రామ సమీపంలో పత్తి పొలాలను పరిశీలించారు. అనంతరం సంజీవనగర్ సమీపంలో ఏర్పాటు చేసిన శిబిరంలోకి ఆయన 9 గంటలకు వెళ్లారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, మాజీ మంత్రి పొంగూరు నారాయణ, ఆనం రంగమయూర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, స్థానిక నేతలు పాల్గొన్నారు.